ప్రజాశక్తి

గురువారం 28 సెప్టెంబర్ 2023 5

అల్లూరి సీతారామరాజు

పారదర్శకంగా అంగన్వాడీ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -పాడేరు :అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మౌఖిక పరీక్షలు అత్యంత పారదర్శకంగా జరిగాయి. పాడేరు ఐటిడిఎ పరిధిలోని పది మండలాలలో ఖాళీగా ఉన్న 30 అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు 106 దరఖాస్తులు రాగా, పలు కారణాలతో ఏడు దరఖాస్తులు తిరస్కరించారు. మిగిలిన 99 దరఖాస్తులు పరిశీలించి పూర్తి స్థాయిలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ తెలిపారు.

ఎటువంటి అవకతవకలు,సిఫార్సులకు తావు లేకుండా, రిజర్వేషన్, ప్రతిభకు ప్రాధాన్యతనిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పిఒ వివరించారు. రాత్రి ఏ సమయానికైనా ఇంటర్వ్యూలు పూర్తిచేసి, ఎంపికైన వారి జాబితాను ప్రకటించి, నియామక పత్రాలను అందజేస్తామన్నారు. ఇంటర్వ్యూ నిర్వహణలో డిఎంహెచ్ఒ డాక్టర్ సి. జమాల్‌భాషా, సిడిపిఒ ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

‘ఉపాధి’ జాబ్ కార్డుల తొలగింపుపై నివేదిక

- ఎంపిడిఒలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం
- ఉపాధి హామీ పథకం అధికారుల పనితీరుపై ఆగ్రహం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు. : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తొలగించిన జాబ్ కార్డులను పున్ణపరిశీలించి, తొలగింపునకు పూర్తి కారణాలతో నివేదిక అందజేయాలని ఎంపిడిఒలనుకలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వేతనదారులకు పనికల్పించాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, మూడు సమావేశాల నుంచి చెప్తున్నా, సరిగా స్పందించని ఎన్‌ఆర్‌ఇజిఎస్ క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చేనెల 10లోగా నివేదికలు ఇవ్వాలని, అలాగే పనితీరు మెరుగు పడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త పనులకు అంచనాలు ప్రతిపాదనలు అందిస్తే, పనులు మంజూరు చేస్తామన్నారు.

పాఠశాల విద్యార్థుల డ్రాపౌట్ వివరాలను సమర్పించాలని ఎంఇఒలకు కలక్టర్ ఆదేశించారు.టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు తిరిగి పాఠశాలలోగానీ, ఓపెన్‌స్కూల్‌లోగానీ ప్రవేశం కల్పించాలని సూచించారు. తరగతుల వారీగా ఎంతమంది విద్యార్థులు బడి బయట ఉన్నారో నివేదించాలని ఆదేశించారు. భవనాలు లేని పాఠశాలలు, విద్యావాలంటీర్ల అవసరాన్ని గుర్తించి, వివరాలు అందజేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. డిజిటల్ తరగతుల పరికరాలను వెంటనే ఇన్‌స్టాల్ చేయాలని ఆదేశించారు.

లేట్‌బర్త్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆమోదించిన జాబితాను ఆయా మండలాలకు పంపించినప్పటికీ, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్ల జారీలో తాత్సారంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కార్యదర్శి సంతకం చేసినట్లు ఎంపిడిఒలు ధ్రువీకరించి సర్టిఫికెట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులను రేషనలైజ్ చేయాల్సిందిగా డిపిఒను ఆదేశించారు. వారి హాజరును పర్యవేక్షించాలని డిఎల్‌డిఒ శాంతకుమారిని ఆదేశించారు. సమావేశంలో డిబిటి మేనేజర్ నరేష్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

జిపిఎస్ బిల్లు ఆమోదం దుర్మార్గం

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు చీకటి రోజు : యుటిఎఫ్

ప్రజాశక్తి- పాడేరు: ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం దుర్మార్గపు చర్య అని, సిపిఎస్ ఉద్యోగులకు ఇది చీకటి రోజు అని అల్లూరి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వి. మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వారంలోపే రద్దు చేస్తామని హామీ ఇచ్చి, ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సర్కార్, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పి నాలుగున్నరేళ్ల తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా శాసనసభలో జిపిఎస్ బిల్లును ఆమోదించి, ఉద్యోగులకు ఇచ్చిన హామీని శాసనసభ సాక్షిగా అపహాస్యం పాలు చేసిందన్నారు. సిపిఎస్ ఉద్యోగులందరికీ ఇది దుర్దినమని ఆవేదన వెలిబుచ్చారు. జిపిఎస్. వద్దని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్. బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యారెంటీ లేని పెన్షన్ స్కీమ్‌ను ఆమోదించి,ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం వంచించిందని ఆరోపించారు. ఏ రాష్ట్రంలో లేని కొత్త విధానం, దేశానికే ఆదర్శమని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. ఉద్యోగి నుండి కంట్రిబ్యూషన్ కట్టించుకొనే విధానం దేశానికే ఆదర్శమెలా అవుతుందనిప్రశ్నించారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా, ఉద్యోగ, ఉపాధ్యాయుల అభీష్టానికి భిన్నంగా ముందుకెళుతున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదన్నారు భవిష్యత్తులో జిపిఎస్. చట్టం రద్దు, పాతపెన్షన్ సాధనకు ం కలిసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

29న అనంతగిరిలో ‘జగనన్నకు చెబుదాం’

ప్రజాశక్తి -అనంతగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 29న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎవివి.కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు కొందరు జిల్లాస్థాయి అధికారులు, పూర్తిస్థాయి మండల అధికారులు పాల్గొని, ప్రజల నుంచి లిఖితపూర్వక దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. మండలంలోని 24 పంచాయతీల తమ సమస్యలపై నేరుగా కలెక్టర్‌కు విన్నవించి, పరిష్కార చర్యలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హాస్టల్ మెనూ పరిశీలన

భోజన పదార్థాలను పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక గిరిజన సంక్షేమ గురుకులం హాస్టల్‌ను సీతగుంట సర్పంచ్ పి మాధవరావు, ఎంపిటిసి కె బొంజుబాబు బుధవారం సందర్శించారు. విద్యార్థులకు ఉదయం అందించిన అల్పాహారం పరిశీలించారు, మెనూ అమలు, రుచి,శుచిగా వండి విద్యార్థులకు పెట్టేలా ప్రిన్సిపల్ డిఎస్.శంకరరావు దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు వారు బయట తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్యకర్తల కుటుంబాలకు టిడిపి అండ

ప్రజాశక్తి- చింతపల్లి :అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నేతలు సుబ్బారావు, అప్పారావు కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చిలకల మామిడి గ్రామానికి చెందిన కొర్రా సుబ్బారావును, చిన్నగెడ్డ గ్రామానికి చెందిన కె.అప్పారావులను పార్టీ శ్రేణులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారావు, అప్పారావు త్వరగా కోలుకోవాలని చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనంద్, నాయకులు ఉమర్, నాగం నాయుడు, మంగు, రామానాయుడు, గణపతి, మంగ్లూ ఆకాంక్షించారు.

బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన
- గిరిజన ప్రజాప్రతినిధుల మౌనంపై మండిపాటు
- వైసిపి సర్కార్ నమ్మకద్రోహం చేసిందని ఆగ్రహం

చింతపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఆదివాసీ గిరజన సంఘం ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు చేపట్టారు. తనన నమ్మితే న్యాయం చేస్తానని నమ్మబలికిన సిఎం జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన వ్యతిరేక చర్యలు చేపడుతూ ఆదివాసీ ద్రోహిగా మారారని, దీనిపై గిరిజన ప్రజాప్రతినిధులు నోరెత్తకపోవడంపై మండిపడ్డారు.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

అరకులోయ : బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అడుగడుగునా ఆదివాసులకు అన్యాయం చేస్తోందన్నారు..‘నన్ను నమ్మండి ఆదివాసులకు అన్యాయం జరగదు’ అంటూ నమ్మబలికిన సిఎం జగన్, గడచిన నాలుగున్నరేళ్లలో బిసి‘ఎ’లో 40 లక్షల మంది గిరిజనేతర బోయ/వాల్మీకులకు ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో ఆమోదించడం ఆదివాసులకు ద్రోహం చేయడమేనని మండిపడ్డారు జిఒ 3రద్దు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో చింతపల్లి, అనంతగిరి కొండలు ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పగిస్తున్నా వంటి గిరిజన వ్యతిరేక నిర్ణయాలతో ఆదివాసీ ద్రోహిగా మారారన్నారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తూ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటున్నా, గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం నోరు మెదపకుండా మౌనం వహించిన సిగ్గుచేటన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలు పరిరక్షిస్తారని, సమస్యలు పరిష్కరిస్తారని నమ్మి ఓట్లేసి చట్టసభలకు పంపిస్తే, స్వార్థపూరిత రాజకీయాలు చేస్తూ, గిరిజనులకు అన్యాయం చేస్తూ, బోయ/వాల్మీకులకు వత్తాసు పలికేలా వ్యవహరిస్తే గిరిజన సమాజం క్షమించదని హెచ్చరించారు. ఇప్పటికైనా వారు మేల్కొని, గిరిజనుల పక్షాన ఉంటారా? లేదా ఆదివాసీ ద్రోహులుగా మిగిలిపోతారో తేల్చుకోవాలని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు మండల నాయకులు టి. హరి, కె. రామారావు, నానిబాబు, కోటేశ్వరరావు, కుమార్, శ్రీను, రాము, కృష్ణ, దేముడు పాల్గొన్నారు.

అనంతగిరిలో జెడ్‌పిటిసి గంగరాజు ఆధ్వర్యాన నిరసన

డుంబ్రిగుడ: బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడాన్ని నిరసిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అడపవలస గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగా ఎంతో అభివృద్ధి చెందిన బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ, నిజమైన గిరిజనులకు అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానం రద్దు చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సిహెచ్ రమేష్, టి పాపారావు,టి నూకరాజు, వి సురేష్ కుమార్, కె.సీతారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతగిరి : బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, అన్ని విధాలా అభివృద్ధి చెందిన కులాలను ఎస్‌టిజాబితాలో నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై జిల్లాపరిషత్, ఐటిడిఎ పాలకమండలి సమావేశాల్లో ఎండగడతానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రతినిధిఎస్ .నాగులు, సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య, వార్డు సభ్యుడు పి.లక్ష్మణరావు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

చింతపల్లి : బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాల్లో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానించడాన్ని నిరసిస్తూ చౌడుపల్లి పంచాయతీ పినకొత్తూరు గ్రామంలో నిరసన చేపట్టారు. ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ 28 లక్షల మంది ఆదివాసులకు ద్రోహం చేసే తీర్మానం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నేత జి లక్ష్మయ్య, పి. రాజబాబు, జి మల్లేష్ రావు, పి చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరకులోయలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడలో ఆదివాసీల నిరసన

బైరవపట్నంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఎంపిపి లక్ష్మి, సిపిఎం నేతలు సత్యనారాయణ, చిన్నబాబు

పునరావాస కాలనీ నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల కోసం బైరవపట్నం పునరావాస కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను తక్షణమే పూర్తి చేయాలని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని జీడిపుప్ప గ్రామానికి చెందిన కొండరెడ్ల కుటుంబాలకు బైరవపట్నంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీని బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. సుమారు ఎనిమిది నెలలు నుండి గుత్తేదారుడు పనులు నిలిపి వేశారని స్థానికులు తెలిపారు. నిర్మాణ పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలిచిపోయినట్లు వారు చెప్పారు. ఇక్కడ సింగిల్ 141 ఇళ్లు, డబుల్ ఇళ్ళ 18 మొత్తం 159 ఇళ్లు నిర్మాణం చేపట్టగా, 120 ఇళ్లు పూర్తి చేశారని, బాత్ రూమ్‌లు 70 పూర్తి చేసినట్లు, 89 పూర్తి కావాల్సి ఉందని సైట్ సూపర్‌వైజర్ సిపిఎం బృందానికి తెలియజేశారు. భూమికి భూమి కేటాయించిన దానిలో జామాయిల్ తోట ఉందని, వాటిని క్లియర్ చేసి తమకు భూమి అప్పజెప్పాలని నిర్వాసితులు సిపిఎం నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్లు కరెంటు, శ్మశానం, పైప్‌లైన్, అంగన్వాడీ, పాఠశాల, గుడి, కమ్యూనిటీ హాల్ ఇంటి అభివృద్ధి పనులు ఇంకా పూర్తి చేయలేదన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, నాయకులు ఖాదర్ బాబు, సోడి మల్లయ్య, ప్రగిల్ల లక్ష్మణ్, ప్రవీణ్, నిర్వాసితులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలో అక్టోబర్ 3 నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి వడుగుల జ్యోతి, ఎంపీడీవో లోకల యాదగిరిశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లోకుల యాదగిరిశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించి సురక్షితంగా ఉండేందుకు ఇంటి వద్ద ఉచిత వైద్యం అందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని తెలిపారు. రోగులను గుర్తించి ఉచితంగా ఏడు రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్యం కోసం వచ్చే బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్లాట్ విధానం పాటించాలని సూచించారు. కేన్సర్, కిడ్నీ వంటి దీర్ఘకాలిక బాధితులు ఉన్నట్లయితే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని కోరారు. క్యాంపు పూర్తి బాధ్యతను ఫ్యామిలీ డాక్టర్ తీసుకుని మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చప్పా సూర్యచంద్రరాణి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్సీల వైద్యాధికారులు లిఖిత, ఉషాశ్రీ, సుజి, రవీంద్ర పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ యాదగిరిశ్వరరావు

రంపచోడవరం : మండలంలోని తామరపల్లి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమావేశం బుధవారం జరిగింది. ఇందులో ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష అక్టోబర్ 17న తమ పంచాయతీ పరిధిలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ చిట్టి దొర, సచివాలయం కన్వీనర్ అబ్బులు, వైసిపి నాయకులు రామకృష్ణ, ఎంఎల్‌డి సాయి, దేవేంద్ర, ఎఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే

అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు లోతా రామారావు, కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-రంపచోడవరం

బోయ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం తక్షణమే రద్దు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మరో ఆరు నెలల్లో ముఖ్యమంత్రి పదవిలో ఉంటారో ఉడతారో తెలియని జగన్మోహన్ రెడ్డి.., బోయ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడం వల్ల షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఆదివాసీలకు ఎటువంటి భంగం కలగకుండా మీ జగనన్నగా హామీ ఇస్తున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, భూములు అన్యాక్రాంతం అవుతాయని, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ఘర్షణ పెరుగుతాయని, రాజకీయ పదవులు కోల్పోతారని, రాజకీయ పెత్తనం పెరిగి గిరిజనులు తమ ప్రాంతాల్లో నిరాశ్రయులవుతారని, అందుచేత ఈ తీర్మానాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేస్తుందని పేర్కొన్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రశాంతంగా ముగిసిన మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు

ఊపిరి పీల్చుకున్న పోలీసులు, గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని మావోయిస్టులు భావించారు. అయితే పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి ఈనెల 21వ తేదీకి ముందే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో వందల సంఖ్యలో పోలీసు బలగాలని మొహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. స్పెషల్ పార్టీ, సిఆర్‌పిఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలు అధిక సంఖ్యలో మోహరించి కూంబింగ్ నిర్వహించి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఆధునిక పరికరాలు, బాంబు స్క్వాడ్ బృందాలతో రహదారులు, కల్వర్టులు తనిఖీ చేశారు. మావోయిస్టులకు సహకరిస్తున్న సానుభూతిపరులపై ప్రత్యేక నిఘా పెట్టారు. గిరిజన గ్రామాల్లో పోలీసులు తిష్టవేశారు. ఎఒబి పోలీసు వలయంలో ఉండడంతో మావోయిస్టులు తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు జరపడానికి అవకాశం లేకుండా పోయిందని చెప్పుకోవచ్చు.

విస్తృతంగా వాహన తనిఖీలు

జీకే వీధి మండలం దారకొండలో స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన పోలీసులు బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గాలికొండ, అమ్మోరు దారకొండ, గుమ్మరేవులు తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలుతో తనిఖీలు ముమ్మరంగా చేశారు. మరో వైపు గంజాయి అక్రమ రవాణాపైనా ఎస్సై రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ డిఎస్‌పి సురేష్ గస్తీ చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి - అడ్డతీగల

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఎంపీపీ రాఘవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుడూ ప్రతి సమావేశంలో చెప్పిన సమస్యలే మళ్లీ చెప్పడం జరుగుతుందని, పరిష్కార మార్గం మాత్రం లేదని పేర్కొన్నారు. పంచాయతీకి రోడ్లు లేవని, తాగునీరుకి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు సరిగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమన్నపాలెం సర్పంచ్ మాట్లాడుతూ ఇంటింటికి కుళాయిలు వేస్తామని చెప్పి పైపులు తెచ్చి పడేశారు తప్ప వాటిని బిగించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మద్దాల వీర్రాజు, 22 పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, స్థానిక తహశీల్దార్ తాతారావు, ఎంపీడీవో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం 33/11 కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు, విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం, ఫాక్స్ పేట, గెద్దాడ, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్యాటక విశిష్టతపై చర్చ

ప్రజాశక్తి- చింతూరు :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చరిత్ర విభాగాదిపతి పి.ఏడుకొండలు పర్యాటక రంగం, దాని అభివృద్ధి గురించి, ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కట్టడాలు, వాటి విశిష్టత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్.అప్పనమ్మ, అధ్యాపకులు కె.శైలజ, కె.శ్రీదేవి, సిహెచ్.రాజబాబు, ఆర్.మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధ్యాపకులు

బహుమతులను అందజేస్తున్న వైస్ ఎంపిపి కొండలరావు

గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు పంచాయతీలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, గిరిజన యువతలో అమోఘమైన క్రీడా శక్తి దాగుంటుందని, వారిని ప్రోత్సహిస్తే, తగు శిక్షణనిస్తే గొప్ప ప్రతిభను కనబరిచి, రాష్ట్రానికే కాకుండా దేశానికి పేరు ప్రఖ్యాతులు తెస్తారన్నారు. హుకుంపేట మండలానికి చెందిన యువ మహిళ క్రికెటర్ వలసనైని రవణి ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచకప్ మహిళ అంధుల క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించి, ప్రపంచకప్ భారత వశం కావడంలో కీలక పాత్ర పోషించడమే ఇందుకు నిదర్శనమన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచిన చిన్న నందిపుట్టు, పెద్ద నందిపుట్టు యువతకు ప్రోత్సాహక నగదు బహుమతులతోపాటు వాలీ బాల్ కిట్లను అందజేశారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో చీకుమద్దుల సర్పంచ్ ఎస్ బొంజన్నదొర, గన్నేరుపుట్టు సర్పంచ్ ఎస్.కృష్ణారావు, జిసిసి విశ్రాంత డిఎం కురసా పార్వతమ్మ, ఎస్‌బిఐ రాష్ట్రస్థాయి మేనేజర్ కొండలరావు, పాడేరు ఎస్‌బిఐ మేనేజర్ కిషోర్, ఏకలవ్య ఫౌండేషన్ హెడ్ సతీష్, రమేష్, జిల్లా హెడ్ శ్రీనివాస్, వాటర్ షెడ్ హెడ్ గంధం శంకర్, ఎఫ్‌సిసి జిల్లా కొనుగోలు కేంద్రం హెడ్ నాని, ఎఫ్‌సిసి చైర్మన్ దూసూరు నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ మర్రి సుబ్బారావు, వాటర్ షెడ్ చైర్మన్ మర్రి వెంకటరావు, వైస్ చైర్మన్ గెమ్మలి బుల్లిబాబు, యువకులు, మహిళలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎస్‌టి సంక్షేమ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పునర్నియామకం

ప్రజాశక్తి -పాడేరు: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఇటీవలే అసెంబ్లీ ఎస్యూరెన్స్ కమిటీ సభ్యులుగానూ, ప్రజా పద్దుల కమిటీ, సిసిఎల్‌ఎ సభ్యులుగానూ, గతంలో వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్సిటీ పాలకమండల సభ్యులుగానూ నియమితులైన భాగ్యలక్ష్మి, ఇపుడు తాజాగా ఎస్‌టి వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా పునర్నియమితులయ్యారు. రెండోసారి ఈ కమిటీలో తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ట్రైబ్స్ వెల్ఫేర్ కమిటీ తొలి సమావేశం చర్చించిందని ఆ కమిటీ సభ్యులు భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం అమరావతిలో అసెంబ్లీ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రైమరీ సమావేశం జరిగింది. కమిటీ అధ్యక్షులు తెల్లం బాలరాజు అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి రెడ్డి శాంతి, చెట్టి పాల్గుణ ఎమ్మెల్సీ రఘురాజు, రాపాక వరప్రసాద్, తలారి వెంకటరమణ పాల్గొన్నారు. గిరిజనుల సమస్యలపై తొలి సమావేశంలో సమగ్రంగా చర్చించామన్నారు. గిరిజన యువత ఉపాధికి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై చర్చించామన్నారు. తొలి సమావేశంలో చర్చించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గిరిజనులు ఆర్థిక, సామాజిక, రాజకీయ తదితర అంశాల్లో అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలను కమిటీ ప్రభుత్వానికి సూచనలు చేస్తుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా తొలి సమావేశం జరిగినట్లు తెలిపారు.

'ఆ హక్కు రాష్ట్ర అసెంబ్లీకి లేదు!'

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై ఆదివాసీ గిరిజన సంఘం నేత చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి - చింతపల్లి : ఇతర కులాలను గిరిజన తెగల్లోకి చేర్చే హక్కు రాష్ట్ర అసెంబ్లీకి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. ఇది ముమ్మాటికీ గిరిజనులకు ద్రోహం చేయడమేనని, స్వాతంత్ర పోరాట యోధుడు అల్లూరి స్ఫూర్తితో దీనిపై పోరాటానికి గిరిజనులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానం రద్దు చేయాలని గిరిజన ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం గిరిజన చట్టాలకు, రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. గిరిజన సలహా మండలి ఆమోదం, గవర్నర్ సిఫార్సుతో రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ఒక్క రాష్ట్రపతికే ఆ అధికారం ఉందని, అంతేగానీ అసెంబ్లీకి, ముఖ్యమంత్రికి లేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. నిజమైన గిరిజనులకు నష్టం, ద్రోహం చేయాలని ప్రభుత్వం, ముఖ్యమంత్రి చూస్తుంటే, గిరిజనుల ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో తీర్మానసమయంలో గిరిజన ఎమ్మెల్యేల మౌనానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దీనిపై ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లో తిరగకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన చట్టాలు, రాజ్యాంగాన్ని అతిక్రమించి రాష్ట్రప్రభుత్వం చేసిన సిఫార్సులను వెనక్కు పంపాలని, దీనిపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో చట్టాలు హక్కులు ప్రాంతం రక్షణ కోసం స్వాతంత్ర పోరాట నాయకుల స్ఫూర్తితో చదువుకున్న మేధావి యువత యువకులు విజ్ఞానవంతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'జగనన్నకు చెబుదాం'కు 207 అర్జీలు

ప్రజాశక్తి- పెదబయలు: అపరిష్కృత ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర ముఖ్య అధికారుల పాల్గొని, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించిన స్పందనలో మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 207 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల్లో అధికశాతం రహదారులు, తాగునీటి సమస్యపైనే వచ్చాయి. రిజిస్ట్రేషన్ కౌంటర్, హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి, గిరిజనులకు ఇబ్బందులు లేకుండా ఫిర్యాదులు స్వీకరించే ఏర్పాట్లు చేశారు. తన కుమారునికి ఉద్యోగం ఉందని తొలగించిన పింఛన పునరుద్ధరించాలని గోమాంగి పంచాయతీ కారుగొండ గ్రామానికి చెందిన గడుతూరి దమయంతి విన్నవించారు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న తనను నోటీసులివ్వకుండా తొలగించారని రోగులపేటకు చెందిన జి.పార్వతమ్మ మొరపెట్టుకున్నారు. పెదబయలు బస్సుస్టేషన్ పునరుద్ధరణ, చేపలవేటకు బోటు ఇప్పించాలని లాకెపుట్టు గ్రామస్తులు, జ్వరాలతో అల్లాడుతున్న రోగులకు, గర్భిణులకు తగు వైద్యసేవలు అందించాలని బొంగరం పంచాయతీ చిత్రకాయపుత్తు, కొండమామిడి, రాళ్ళగొంది, పోతులగరువు గ్రామాస్తులు విన్నవించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, డిడి కొండలరావు, ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య, తహశీల్దార్ కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వారపుసంతలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

పెదబయలు రూరల్ : పెదబయలు వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బుధవారం జగనన్నకు చెబుదాంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ పెదబయలు మండల నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు చెండా లోహితాసు, మండల అధ్యక్షులు జె.దేవరాజు, ఉపాధ్యక్షులు కె.కృష్ణ విన్నవించారు. ఏజెన్సీతోపాటు ఒడిశా గ్రామాల నుంచి వారపుసంతకు వచ్చే ప్రజలు తాగునీరు, మరుగుదొడ్లు, రోడ్లు, ఇతరత్రా సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్కరంలో కె.నరసింగరావు, అప్పన్న, ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లా టూరిజం అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ వేలీ స్కూలు వద్ద గల ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ప్రాంతీయ డైరెక్టర్ ఫణికుమార్ ముఖ్యఅతిథిగా హాజరూ మాట్లాడారు. పర్యాటకం ప్రాముఖ్యతను గురించి వివరించారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసే దిశగా అందరం కృషి చేయాలన్నారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబరులో నిర్వహించే వైజాగ్ ఉత్సవాల్లో ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్ ఉత్పత్తులను ప్రదర్శించడానికి కేటాయించబడిన స్టాల్‌లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథి ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్ ప్రత్యేక ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, టూరిజం అధికారులు బాసంత్, ఉపాధ్యాయులు ఆర్.రవి, పార్థశారధి, బి.కుమిదిని, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ టూరిజం ప్రాంతీయ డైరెక్టర్ ఫణికుమార్

శిక్షణాంశాలను తరగతి గదిలో అమలుపర్చాలి : డిఇఒ

ప్రజాశక్తి -ఆనందపురం : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పరిచి విద్యార్థుల అభివృద్ధికి దోహదపడాలని డిఇఒ చంద్రకళ సూచించారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల కాంప్లెక్స్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరికి ఎస్ఎస్ఎ జిల్లా రిసోర్స్‌పర్సన్ శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమంలో డిఇఒ మాట్లాడుతూ, సరళమైన రీతిలో బోధన అందించడానికి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఇఒ గంగరాజు, కోర్స్ డైరెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు

అప్పన్నను దర్శించిన ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీ వరహాలక్ష్మీనరసింహ స్వామిని బుధవారం యానిమల్ హస్‌బెండరీ కమిషనర్ అభిజిత్ మిత్ర (ఐఎఎస్) దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ అధికారులు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో లెక్కించారు. గడిచిన 35 రోజుల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ.2,01,87,656, బంగారం 136 గ్రాములు, వెండి 15 కిలోల 250 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన డాలర్లు, కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సరాసరి ప్రతిరోజూ స్వామికి రూ.5,76,790 లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఎఇఒలు రమణమూర్తి, నరసింహారాజు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి-పద్మనాభం : జగనన్న ఆరోగ్య సురక్షపై మండల కార్యాలయంలో అన్ని శాఖ అధికారులతో ఎంపిపి కె.రాంబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో మెడికల్ క్యాంపుకు కనీసం 500 నుంచి 600 మంది వచ్చేటట్లు అధికారులు కృషి చేయాలని చెప్పారు. మెడికల్ క్యాంపుకు వచ్చే వారికి భోజన వసతి కూడా కల్పించాలన్నారు. రేవిడి పిహెచ్‌సి అధికారి స్వప్న మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మండలంలో విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న సచివాలయ పరిధిలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి కూపన్లు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం.విజయకుమార్, ఎంఇఒ బాబూలాల్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ శ్రీనివాస్, ఇఒఆర్‌డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవిష్య నిధి 'సుకన్య సమృద్ధి యోజన'

ప్రజాశక్తి -ఆనందపురం : బాలికల భవిష్యత్తు అవసరాలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ఎంతగానో దోహదపడుతుందని ఆనందపురం సబ్ పోస్ట్ మాస్టర్ ఎంఎస్‌హెచ్.కృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఎన్జీవో సంస్థ ప్లాస్టిక్ చేంజ్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాగితాలను ఏరుకుని పిల్లలను దత్తత తీసుకొని ఉచితంగా ఆనందపురం పోస్టల్ కార్యాలయంలో సుకన్య సమృద్ధి యోజన పథకం అకౌంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ పోస్ట్ మాస్టర్ కృష్ణ మాట్లాడుతూ, పదేళ్ల లోపు బాలికలకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ.1.50 లక్షలు పలుమార్లు జమ చేసుకోవచ్చని తెలిపారు. వీటికి ఎనిమిది శాతం వడ్డీ వస్తుందని పేర్కొన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత కొంత మొత్తం డ్రా చేసుకోవచ్చని తెలిపారు. 21 సంవత్సరాలు నిండిన తర్వాత బాలికలకు మాత్రమే వడ్డీతో పాటు అసలు డబ్బులు ఇస్తారని పేర్కొన్నారు. వలస కూలీలు ఏ ప్రాంతంలోనైనా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జమ చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, ఎన్జీవోలు సునీత, సంతోషి పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -విఆర్.పురం : రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ శాఖ సమావేశం తుర్రం బాబూరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఇందులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ పెద్దమట్టపల్లి నుండి భూరుగువాడ రోడ్డుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ వెట్టి లక్ష్మి, సభ్యులు పూనెం జయమ్మ, కారం లక్ష్మణ రావు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా నిలిచిన బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు గత రెండు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. సాంకేతిక లోపాలు తలెత్తి బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు నిలిచిపోయినప్పటికీ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టలేదని, సిబ్బంది అందుబాటులో లేరని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. 2జి, 4జి సెల్ సేవలు పూర్తిస్థాయిలో నిలిచిపోవడంతో సమాచార వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సాంకేతిక లోపాలు సవరించి సెల్ సేవలు అందుబాటులో తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

రేపు మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 29న శుక్రవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లుజిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి-మార్ట్, అపోలో టైర్ కంపెనీలు ఈ మినీ జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18 నుండి 24 మధ్య వయస్సు ఉండి, 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యా అర్హత సరిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ.10వేలు నుండి రూ.14వేలు వరకు జీతం ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.apssdc.in, లేదా 916304634447 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

ప్రజాశక్తి -అడ్డతీగల : కాంట్రాక్ట్ ఉద్యోగుల కొన్ని దశాబ్దాల కలను నెరవేర్చుతూ సర్వీసుల క్రమబద్ధీకరణ చేస్తుండడం పట్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అల్లూరి జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సంఘం నాయకులు జి.మల్లిరాజు, సిహెచ్.రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి అసెంబ్లీలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని తీర్మానం ఆమోదించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుండి పడుతున్న కష్టానికి ప్రతి ఫలం వచ్చిందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇంకా మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఎటపాక : వాగు దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన గన్నవరం గ్రామానికి చెందిన కరి సత్యనారాయణ (59) మృతదేహం బుధవారం లభ్యమైంది. సత్యనారాయణ సోమవారం ఉదయం పశువులను మేపేందుకు వాగు దాటాడు. సాయంత్రానికి పశువుల ఇంటికి వచ్చిన సత్యనారాయణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.

అదే రోజు వాగులోకి భారీగా నీరు చేరడంతో అనుమానంతో ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎటపాక పోలీసులు వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సత్యనారాయణ మృతదేహం బుధవారం వాగులో లభ్యమైంది. కేసు నమోదు చేసుకున్న ఎటపాక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఊరూ వాడను కదిలిస్తూ..

ఉత్సాహంగా ఉక్కు రక్షణ యాత్ర

ఎనిమిదో రోజుకు 1200 కిలోమీటర్లు - అన్ని తరగతుల నుంచీ విశేష మద్దతు

స్టీల్‌ప్లాంట్ కోసం ఉద్యమించని పార్టీలను ఓడించాలని సిపిఎం నేతలు గఫూర్, లోకనాథం పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన బైక్‌యాత్ర బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ నెల 20న విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు (పాడేరు డివిజన్) జిల్లాల మీదుగా అనకాపల్లికి చేరుకుని మంగళ, బుధవారాల్లో ఆ జిల్లా ప్రజానీకాన్ని ఉక్కు పోరుకు సన్నద్ధం చేసింది. బుధవారం నక్కపల్లి, అడ్డురోడ్, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, అనకాపల్లి, లంకెలపాలెం, విశాఖపట్నం జిల్లా అగనంపూడి మీదుగా ఉక్కు టౌన్‌షిప్‌నకు వచ్చింది. 8వ రోజు నాటికి 1200 కిలోమీటర్ల మైలురాయిని యాత్ర చేరుకుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం నేతృత్వంలోని బైక్ యాత్ర బృందానికి వివిధ తరగతుల ప్రజల మద్దతు దక్కుతోంది. గ్రామాల గుండా వెళ్లిన బైక్ యాత్రా బృందంపై పూలు జల్లి, హారతులద్ది సాగనంపుతున్నారు. అలసటను లెక్కచేయకుండా ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాలన్న సంకల్పంతో యాత్ర ముందుకు సాగుతోంది. ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెడుతున్న మోడీ ప్రభుత్వ కుట్రలను ప్రజలకు నేతలు విడమర్చి చెబుతున్నారు. ప్రయివేటీకరిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా తగ్గుతాయో, ఈ ప్రాంత అభివృద్ధికి నష్టం ఎలా జరగబోతుందో వివరిస్తున్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు, ప్రదర్శనలు ఆలోచింపజేస్తున్నాయి. అనేక చోట్ల విద్యార్థులు సభకు వచ్చి తమ సంఘీభావం తెలిపారు. బుధవారం జరిగిన బైక్ యాత్రలో పలుచోట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు.

అనకాపల్లి : బైపాస్ రోడ్డులో సిపిఎం శ్రేణులు, కార్మికులు, ప్రజలు పూల వర్షంతో యాత్రా బృందానికి స్వాగతం పలికారు. అనంతరం యాత్ర ఆర్‌టిసి కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు మీదుగా పాత బెల్లం మార్కెట్ వద్దకు చేరుకుంది. అనంతరం ప్రజలనుద్దేశించి గఫూర్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో మోడీ సర్కారుకు సహకరిస్తున్న పార్టీలకు రానున్న కాలంలో బుద్ధి చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు రావాలన్నా, రిజర్వేషన్లు అమలు కావాలన్నా ప్రభుత్వ రంగం ఉండాలన్నారు. ప్లాంట్ కోసం ప్రజలను కలుపుకుంటూ సిపిఎం ముందుకు సాగుతుందన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు యువత, విద్యార్థులు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, పెద్ద సంఖ్యలో కార్మికులు, ముఠా కార్మికులు, స్కీం వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రాంబిల్లిలో నిర్వహించిన సభలో గఫూర్, లోకనాథం

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి లోకనాథం, జగన పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సాగిన యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి బస్ కాంప్లెక్స్ సమీపంలో సభ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులను ఉద్దేశించి గఫూర్, లోకనాథం మాట్లాడారు. ముఖ్యంగా లోకనాథం విశాఖ ఉక్కు ఆవిర్భావ చరిత్రను విద్యార్థులకు విశదీకరించారు. ప్లాంట్ మనుగడను కాలరాయడానికి పూనుకున్న మోడీ విధానాలపై యుద్ధం ప్రకటించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మేయడానికి పూనుకున్న బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి సైతం వైసిపి, టిడిపి, జనసేనలు ముందుకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్, ఎం.అప్పలరాజు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు రమణ మాట్లాడారు.

అచ్యుతాపురం : బైక్ యాత్రకు సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో నాయకుల ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యాత్రా బృందం వెంట సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కాంగ్రెగుల రామసదాశివరావు, కె.సోమినాయుడు, ఎస్.కనుమ నాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి బి.రామ్ కుమార్, ఐద్వా మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలో యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. దారిపొడవునా యాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలపై ప్రజలు పూలు జల్లి, హారతులు ఇచ్చారు. రాంబిల్లిలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అధ్యక్షతన సభ జరిగింది. కార్యక్రమంలో యాత్ర బృందంతో పాటు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : యాత్రకు స్థానిక బైపాస్ జంక్షన్‌లో ఘన స్వాగతం లభించింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, టెక్కలి జగ్గ అప్పారావు పాల్గొన్నారు.

ఉక్కునగరం : అగనంపూడి కూడలి వద్ద యాత్రకు ఘన స్వాగతం లభించింది. లోకనాథం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

యలమంచిలిలో నాయకుల ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మణుగుల శివనాగదుర్గ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎజ్రా శాస్త్రి బుధవారం తెలిపారు. ఇటీవల అనపర్తిలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శివ నాగదుర్గ విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. శివనాగాదుర్గను హెచ్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

15వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా రంపచోడవరంలో టిడిపి క్యాంపు కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 15వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, పెంటపాటి అనంత మోహన్, జెఎస్.నగేష్, దంతులూరి శివరామరాజు, గోర్లే సునీత, అడబాల బాపిరాజు, సంఘం శ్రీకాంత్, వై.నిరంజన్ దేవి, తైలం గంగాధర్ రావు, సర్పంచ్ లోత లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. బుధవారం నాటి కార్యక్రమంలో టిడిపి నాయకులు బరపాటి ప్రకాష్, ఎడవల్లి భాస్కరరావు, రసూల్, చిన్నారెడ్డి, మల్లెల వెంకటేశ్వరరావు, పొదిలి రామారావు, ముత్యాల శ్రీరామ్ సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో ఇటీవల ఎంపికైన ఐదుగురు నూతన వాలంటీర్లకు ప్రజా ప్రతినిధులు చేతుల మీదగా బుధవారం నియామక పత్రాలు అందజేశారు. కిండర్ పంచాయతీలో ఖాళీగా ఉన్న 3, గడుఓకుర్తి పంచాయతీలో 2 వాలంటీర్ల పోస్టులకు ఇటీవల ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి గోన్ వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చప్పా చందర్రాణి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, చంద్రుడు, సత్యవతి, ఏ సుబ్బలక్ష్మి, ఘనలక్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఏజెన్సీలోని 11 మండలాల పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో రంపచోడవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డివిజనల్ స్థాయి సమీక్షా సమావేశం డివిజనల్ పంచాయతి అధికారి జివిఎల్ఎన్‌వి రాఘవన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో విధులకు హాజరు కాని పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బందిపై శాఖాపరమైన క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ ప్రాపర్టీ రిజిస్టర్ నిర్వహించాలని, పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి జీత భత్యములు చెల్లించడానికి అవసరమైన ఆదాయం పెంపునకు కృషి చేయాలని, బకాయి ఇంటి పన్నులు వెంటనే వసూళ్లు చేయాలని, ప్రభుత్వ భవనాలు, వ్యాపార సంస్థలకు ఇంటి పన్నులు విధించాలని ఆదేశించారు. గ్రామానికి కనీసం ఒక క్లాప్ మిత్రాను నియమించుకొని పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

30న పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : నీతి ఆయోగ్ పథకం ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 30న ఢిల్లీ నుండి ప్రారంభిస్తారని ఎపి శిశు సంక్షేమ శాఖ కమిషనర్ జానకి తెలిపారు. బుధవారం స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరం నుండి నీతి ఆయోగ్ అధికారులతో శిశు సంక్షేమ శాఖ కమిషనర్ జానకి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ నీతి ఆయోగ్ ద్వారా ఎపిలో 10 శాఖల ద్వారా యాస్ ప్రిన్ బ్లాక్ ప్రోగ్రాం, సంకల్ప సత్ హా ప్రోగ్రాం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. దీనికి ఎపిలో 15 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై రామవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, సిడిపివోలు ప్రసన్న లక్ష్మి, సంధ్యారాణి, సిహెచ్ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.